batukammanews.com
TEL/2019/78873

బతుకమ్మ

29 నవంబర్ 2026
ఆదివారం

తాజా వార్తల సద్దిమూట

పోలీసులను చూస్తే నేరస్తులు భయపడాల్సిందే..!

నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం

నాడు తుపాకి గుల్ల చప్పుడు నుంచి నేడు అభివృద్ధి వైపు అడుగులు

విలేజ్ కమిటీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

నిజామాబాద్‌తో 27 ఏళ్ల అనుబంధం

నిజామాబాద్ సమీక్ష సమావేశంలో డీజీపీ సి.వి.ఆనంద్



2 లో



నేరాల నియంత్రణలో పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిందేనని ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఎలర్జీ అని కానీ నేరస్తులు పోలీసులను చూస్తే భయపడాల్సిందేనని రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ అన్నారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఉదయం నిజామాబాద్ రూరల్ ఏసీపీ కార్యాలయం, మోపాల్ పోలీస్ స్టేషన్ లను డీజీపీ సి.వి.ఆనంద్ ప్రారంభించారు. అనంతరం పోలీసు కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ యూనిఫాంలో ఉన్న పోలీసులను విధి నిర్వహణలో అడ్డుకున్నా వారిపై దాడులకు పాల్పడినా సహించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పోలీసులు ఎవరైనా తప్పు చేసినట్లయితే ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని,బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రగ్స్, గంజాయి ముఠాలు,రౌడీ గ్యాంగ్‌లను అణచివేసేందుకు సమర్థ వంతమైన పోలీసింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నేరాలు నియంత్రణ చేస్తున్నట్టుగా వివరిస్తూ కొన్ని లోపాలను సరి చేసుకోవాలని సూచిస్తూ జిల్లా పోలీసుల పనితీరును అభినందించారు.

– నిజామాబాద్, బతుకమ్మ

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్‌కు మంగళం..!

- తెలంగాణ ఇంటర్ ప్రాక్టికల్స్ నిబంధనల్లో మార్పు సొంత కాలేజీల్లోనే ప్రాక్టికల్స్..
- విద్యార్థులకు రిలీఫా? లేక ప్రైవేట్ కాలేజీలకు పండగా?



2 లో

వేరే కాలేజీలకు వెళ్లే టెన్షన్ లేకుండా విద్యార్థులు తమ సొంత కాలేజీల్లోనే ప్రాక్టికల్స్ రాసుకునే పాత విధానాన్నే కొనసాగించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. అయితే ఈసారి ఒక పెద్ద మార్పు ఉంటుందని బోర్డు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఇంటర్ బోర్డును రద్దు చేసి పాఠశాల విద్యలో విలీనంకు కసరత్తు జరుగుతుంది. 2027లో బోర్డు లేకుండానే సెకండరీ విద్యా విధానంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్లస్ టూ తరగతుల నిర్వాహణ జరుగనుంది. ఇప్పటివరకు సెకండియర్ విద్యార్థులకే ఉన్న ప్రాక్టికల్స్ 2027 నుంచి ఫస్ట్ ఇయర్ విద్యార్థ లకు కూడా జరగనున్నాయి. జనవరి 29న ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ తో మొదలై ఫిబ్రవరి 1 నుంచి 18 వరకు సైన్స్ ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు.

– హైదరాబాద్, బతుకమ్మ

నిజామాబాద్ రూరల్ డివిజన్

ఏసీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన డీజీపీ



2 లో

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు

బాటలు వేయాలి

ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి

అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధించడం ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. నవీపేట మండలం మోకన్ పల్లిలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యా లయంలో 80 లక్షల పైచిలుకు నిధులతో నూతనంగా నిర్మించిన ఆరు అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ లను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి శనివారం అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు.

– నవీపేట్, బతుకమ్మ



2 లో

మాక్లూర్ పీహెచ్సీని ఆకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు

2

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ జిల్లాలోని మాక్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

– మాక్లూర్, బతుకమ్మ



మాక్లూర్ పీహెచ్సీని ఆకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు



ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అందించే సేవలు అన్నింటిని పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఏ విధంగా సేవలందిస్తున్నారని పరిశీలించి సమీక్షించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లలో 12 రకాల ప్రోగ్రాములు ప్రధానమైనవని సుమారు 35 రకాల జాతీ ఆరోగ్య కార్యక్రమాల సేవలు అందించబడతాయన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందించే సేవలు ప్రధానమైనవి ఫార్మసీ, ల్యాబ్ సేవలు, మాతా శిశు ఆరోగ్యం సేవలు, ఓపి సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సరిపడా మందుల నిలువ ఉంచుకోవాలని, రోగుల వద్ద నుండి శాంపిల్స్ సేకరించి రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, టి హబ్ నకు శాంపిల్స్ పంపియాలని తెలియజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు మాత శిశు ఆరోగ్య సేవలు అందించడమే కాకుండా సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలని అన్నారు. ఓపి రోగుల సంఖ్యను పెంచాలని కోరారు. పీఏస్సీ ప్రాంగణంలో నిర్మించిన యోగ కేంద్రంలో ప్రతిరోజు యోగా చేసేలా ప్రణాళికలు రచించాలని తెలియజేశారు.ఈ సందర్భంగా అందిస్తున్న సేవలపై పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆరోగ్య సేవలో అందించాలని అన్నారు. తద్వారా ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగించాలని సూచించారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి



పాఠశాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి, భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని, నూటికి నూరు శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా చొరవ చూపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులలో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నామని అన్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే విషయంలో ప్రభుత్వం ఎంతమాత్రం రాజీ పడబోదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. నాణ్యతతో కూడిన ఏకరూప దుస్తులతో పాటు షూ, టై, బెల్ట్ వంటి అన్ని వసతులు సమకూరుస్తున్నామని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా సాంకేతిక విద్యకు తోడ్పాటును అందిస్తున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా తమ బాధ్యతను గుర్తెరిగి నాణ్యమైన విద్యను బోధిస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో ప్రవేశాలు గణనీయంగా పెరిగేలా చూడాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాలని అన్నారు. ఆయా సబ్జెక్టులలో వెనుకంజలో ఉన్న విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, నాణ్యమైన పౌష్టిక ఆహారం అందేలా చూడాలన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తాము కృషి చేస్తామని, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన, క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించాల్సిన బాధ్యత మాత్రం ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. విద్యతో పాటు పిల్లలకు శారీరక వృద్ధికి దోహదపడేలా క్రీడలు, వ్యాయామం, యోగ వంటి వాటిలో శిక్షణ ఇప్పించాలని, వారు ఆరోగ్యంగా ఉంటూ చక్కగా చదువుకునేలా ప్రోత్సహించాలని హితవు పలికారు. నేటి సమాజంలో శారీరక శ్రమను విస్మరించడం వల్ల అనేక మంది అనారోగ్యాల బారినపడుతున్నారని, ఫలితంగా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు క్రీడలు, వ్యాయామంను తమ దైనందిన జీవితంలో భాగంగా మలుచుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య గణనీయంగా ఉన్నందున అదనంగా మరో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, సోలార్ వాటర్ హీటర్, డ్యూయల్ డెస్క్ బెంచ్ లను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ, విద్యార్థిని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారం అందేలా పర్యవేక్షణ చేయాలన్నారు. గత ఏడాది పదవ తరగతిలో 98శాతం ఉత్తీర్ణత నమోదయ్యిందని, ఈసారి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, సమయాన్ని వృధా చేయకుండా చక్కగా చదువుకోవాలని విద్యార్థినులకు హితవు పలికారు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రతను చూపగల్గుతారని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తూ వారిని సన్మార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని అధ్యాపకులకు మార్గనిర్దేశం చేశారు. ఏ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఇంచార్జి డీ.ఈ.ఓ సాయాగౌడ్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, స్థానిక సర్పంచ్ విరీష తదితరులు పాల్గొన్నారు.



పోలీసులను చూస్తే నేరస్తులు భయపడాల్సిందే..!

శాంతిభద్రతల పరిరక్షణలో భేష్

నిజామాబాద్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని డీజీపీ అభినందించారు. మతసామరస్యం,శాంతిభద్రతల పరిస్థితి అదుపులో ఉండటం సంతృప్తికరమన్నారు. తాళ్ళరాంపూర్ విలేజ్ ఘటన నేపథ్యంలో విలేజ్ డెవలప్మెంట్ కమిటీల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని, చట్టాన్ని చేతిలోకి తీసుకున్న వారిపై ఈ సంవత్సరం 69 కేసులు నమోదైనట్లుగా వివరించారు. ఒకప్పుడు నక్సల్స్ తూటాల శబ్దాలతో మారుమోగిన ప్రాంతాలు నేడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసిపోయి, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అయితే వారి కదలికలపై పోలీసుల నిఘా కొనసాగుతుందని విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిజామాబాద్ పోలీసులు మా ఊరు.. మా భద్రత వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువవుతూ నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నారని డీజీపీ పేర్కొన్నారు.

నిజామాబాద్‌తో 27 ఏళ్ల అనుబంధం

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాతో తనకు 27 ఏళ్ల అనుబంధం ఉందని డీజీపీ పేర్కొన్నారు. తనకు జిల్లా ఎస్పీగా మొదటి పోస్టింగ్ జిల్లాలోనని గుర్తు చేశారు. తన రెండవ కుమారుడు ఇక్కడ ఎస్పీగా పని చేస్తున్నప్పుడే జన్మించడంతో అతని పేరును గుర్తు చేసుకునే విధంగా పెట్టినట్లు తెలిపారు. అప్పట్లో చేపట్టిన భవన నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలను పరిశీలించారు.

గోదావరి పుష్కరాలకు పటిష్ఠ భద్రత

రానున్న గోదావరి పుష్కరాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. పుష్కరాల సమయంలో రోజుకు సుమారు 2.5 లక్షల మందితో?మొత్తం 1.3 కోట్ల మంది భక్తులు వచ్చే అంచనాతో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ఇతర భద్రతా చర్యలపై ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే సామాన్య ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని డీజీపీ సూచించారు.

తగ్గిన తీవ్రమైన నేరాలు.... పెరిగిన చిన్న తరహా మోసాలు!

నిజామాబాద్ జిల్లాలో తీవ్రమైన నేరాలు తగ్గుముఖం పడుతున్నా.. ఆర్థిక మోసాలు, మాదకద్రవ్యాల కేసులు, రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నట్లు డీజీపీ వివరించారు. హత్యలు, తీవ్రమైన అత్యాచారాలు, రాత్రి వేళల్లో ఇళ్లలో చోరీలు తగ్గగా చీటింగ్, నమ్మకద్రోహం కేసులు 34 నుంచి 35 శాతం, సాధారణ గాయాల కేసులు 18 శాతం, డ్రగ్స్ కేసులు 47 శాతం, రోడ్డు ప్రమాదాలు 10 శాతం పెరిగాయన్నారు. 2026లో నమోదైన కేసుల్లో 54 శాతం ఇంకా దర్యాప్తు దశలోనే ఉన్నాయని, కేవలం 34 శాతం కేసుల్లో మాత్రమే 60 రోజుల గడువులో ఛార్జిషీట్లు దాఖలవుతున్నాయన్నారు. న్యాయస్థానాల్లో విచారణ కోసం 15092 కేసులు పెండింగ్లో ఉండగా నేరాల నియంత్రణ తోపాటు నమోదైన కేసులను సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి, నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. 2026లో నమోదైన నేరాల పరంగా ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ 607 కేసులతో మొదటి స్థానంలో ఉండగా నిజామాబాద్ రూరల్ 460, టౌన్ 1లో?449, బోధన్ 443, నగరంలోని 4వ టౌన్ లో 410 కేసులతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయన్నారు. ఈ ఐదు పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే కమిషనరేట్ మొత్తం నేరాల్లో 30 శాతం నమోదయ్యాయి. ఆయా స్టేషన్ల పరిధిలో 1393 కేసులు ఇంకా దర్యాప్తులో ఉన్నాయని, నిజామాబాద్ రూరల్‌లో నేరాలు గత ఏడాదితో పోలిస్తే 24 శాతం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. 2025లో 294 తీవ్రమైన నేరాలు నమోదుకాగా 2026 నవంబ రు 15 నాటికి222 నమోదయ్యాయి. గత ఏడా దితో పోలిస్తే 14 శాతం తగ్గాయని, హత్యలు, తీవ్రమైన అత్యాచారాలు, రాత్రి వేళల్లో జరిగే చోరీలు తగ్గడం పోలీసులకు ఊరటనిస్తోందన్నారు.

పనితీరులో వెనుకబడిన స్టేషన్లు


నూతన క్రిమినల్ చట్టాల అమలు, కేసుల పరిష్కారం, 60,90 రోజుల గడువులో దర్యాప్తు పూర్తి చేయడం, సంఘటన స్థలంలోనే ఎఫ్ఐఆర్ నమోదు, ఈ-పెట్టీ కేసుల పరిష్కారం తదితర అంశాల ఆధారంగా పోలీస్‌స్టేషన్ల పనితీరును సమీక్షించారు. ఈ ప్రమాణాల్లో నిజామాబాద్ టౌన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, నిజామా బాద్ నగరంలోని 3వటౌన్, బిక్కనూరు, బోధన్, నవీపేట్, ముప్కాల్ పోలీస్‌స్టేషన్ల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఈ విలేకరుల సమావేశంలో నిజామాబాద్ సిపి సాయి చైతన్య, ఐజీ కార్తికేయ (మల్టీజోన్-1), సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, సైబర్ సెక్యూరిటీ ఎస్పీ హర్షవర్ధన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్‌తో నిజామాబాద్ అడిషనల్ డీసీపీ శుభం ప్రకాష్, డీసీపీ లు, ఏసిపి లు, ఎస్ హెచ్ఓలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన డీజీపీ

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా నిజామాబాద్ రూరల్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని డీజీపీ సి.వి.ఆనంద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏసీపీ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించి, పోలీస్ అధికారులతో మాట్లాడారు. ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలను అందించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవం తమైన పోలీసింగ్‌ను అమలు చేసేందుకు డివిజన్ స్థాయిలో కార్యాల యాల ఏర్పాటు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే దిశగా అధికారులు నిరంతరం కృషి చేయాలని సూచించారు

హరిహర క్షేత్ర వార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభం

భీమ్‌గల్, బతుకమ్మ :మండలంలోని గోనుగొప్పుల శ్రీ హరిహర క్షేత్ర 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక హరిహరులు కొలువైన దేవాలయం కావడంతో ఈ వేడుకలకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది.ఉత్సవాల మొదటి రోజునై శనివారం ఆలయంలో పుణ్యాహవచనం,గణపతి పూజ,ప్రత్యేక హోమములు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



ఇంటర్ ప్రాక్టీకల్స్‌లో జంబ్లింగ్‌కు మంగళం..!



జంబ్లింగ్ లేకపోవడం వల్ల కొత్త సెంటర్లకు వెళ్లే ప్రయాణ భారం, భయం తగ్గుతాయని విద్యార్థులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కానీ ఇక్కడే ఒక అసలు ప్రశ్న మొదలైంది. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో అసలు ల్యాబ్‌లే సరిగ్గా చేయించకుండా, అదనపు ఫీజులు వసూలు చేసి 30కి 30 మార్కులు వేసేస్తున్నారనే ఆరోపణలు ఏళ్లుగా ఉన్నాయి. ఆ అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికే జంబ్లింగ్ తేవాలనుకున్నారు. ఇప్పుడు అది ఆగిపోయింది. సొంత కాలేజీల్లోనే ప్రాక్టికల్స్ నిర్వహించడం విద్యార్థులకు మేలు చేస్తుందా? లేక ప్రాక్టికల్ నాలెడ్జ్ లేకుండానే మార్కులు వచ్చే వ్యవస్థను ప్రోత్సహించినట్లు అవుతుందని దీనిపై తల్లిదండ్రులు,అధ్యాపకులు ఏమంటారనే చర్చ జరుగుతుంది.

ఎస్ఎస్ఆర్ డిస్కవరీ స్కూల్‌లో ఘనంగా చిల్డ్రన్స్ కార్నివాల్

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ:నగరంలోని మాధవ్‌నగర్‌లోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ స్కూల్‌లో చిల్డ్రన్స్ కార్నివాల్ వేడుకలను విద్యార్థుల ఉత్సాహం, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. శనివారం స్కూల్ అవరణలో జరిగిన ఈ వేడుకలకు విద్యార్థులు రోజువారీ పాఠశాల యూనిఫామ్‌కు భిన్నంగా రంగురంగుల సాధారణ దుస్తులు ధరించి, పుస్తకాల బ్యాగులు, లంచ్ బాక్సులు లేకుండా పాఠశాలకు హాజరయ్యారు. సాధారణ తరగతులకు విరామం ప్రకటించి?విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వినోదభరిత కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మ్యాజిక్ షో అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. మాయాజాల ప్రదర్శనలను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఆనందంగా తిలకించారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు విద్యార్థులను అలరించాయి.వివిధ ఆటలు, వినోద





కార్యక్రమాల్లో విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. తరగతి గదులకే పరిమితం కాకుండా ఉపాధ్యాయులతో కలిసి ఆటపాటల్లో గడపడం విద్యార్థులకు ప్రత్యేక అనుభూతిని కలిగించింది.కార్నివాల్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌లో వివిధ రకాల ఆహార పదార్థాలను విద్యార్థులు ఆస్వాదించారు. స్నేహితులు, ఉపాధ్యాయులతో కలిసి రోజంతా ఆటపాటలతో, నవ్వులతో, ఆనందంగా గడిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఉల్లాసం, స్నేహభావం, ఉపాధ్యాయులు–విద్యార్థుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ చిల్డ్రన్స్ కార్నివాల్ విద్యార్థులకు మధురమైన జ్ఞాపకాలను అందిస్తూ ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

ప్రతి పేద కుటుంబానికి జీవిత బీమా రక్షణే లక్ష్యం సర్పంచ్ ఇట్టిడి లింగారెడ్డి

ఆలూర్, బతుకమ్మ :ఆలూర్ మండలంలోని దేగాం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని దేగాం సర్పంచ్ ఇట్టిడి లింగారెడ్డి,ఆలూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేగాం ప్రమోద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఇట్టిడి లింగారెడ్డి,దేగాం ప్రమోద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ లభిస్తుందని, కుటుంబ పెద్దను





కోల్పోయిన సమయంలో ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమ పాలన అందిస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముత్యం రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు యాదగౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సాయి, మల్లేష్,డీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీపీ పస్క సర్సయ్య, నాయకులు గంగాధర్, గంగారాం తదితర గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి

పూలే చేసిన సేవలు చిరస్మరణీయం

పూలే ఆశయాల సాధనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు కృషి చేయాలి

భీమ్‌గల్, బతుకమ్మ :మహాత్మా జ్యోతిరావు పూలే 136వ వర్ధంతిని పట్టణ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో నెలకొన్న కుల వివక్ష, అంటరానితనం నిర్మూలన కోసం మహాత్మా జ్యోతిరావు పూలే నిరంతరం పోరాడారని కొనియాడారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి బాలికల విద్య కోసం పాఠశాలలను స్థాపించి మహిళా విద్యకు బాటలు వేశారని గుర్తు చేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. మహనీయుల ఆశయాలను కాపాడుతూ, వారు చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వ సమాజ స్థాపనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సోదరులంతా ఎల్లవేళలా ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, జేఏసీ చైర్మన్ ఈశ్వర్, దళిత సంఘాల అధ్యక్షుడు గడల ప్రసాద్, కౌన్సిలర్లు అనంతరావు, శ్రీనివాస్, రవి, రతన్, రవీందర్, రాజేందర్, దేవిదాస్, కాంతయ్య, లక్ష్మణ్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల భారీ డంప్ వెలికితీత

...రూ.4.29 కోట్ల విలువైన బంగారం బిస్కిట్ లు

...రూ.24 లక్షల నగదు స్వాధీనం!

బస్తర్, బతుకమ్మ :ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు భారీ మావోయిస్టు డంప్‌ను వెలికితీశాయి. ఇంద్రావతి నది సమీపంలోని అటవీ ప్రాంతంలో భూమిలో పాతిపెట్టిన పెట్టె నుంచి సుమారు రూ. 4.29 కోట్ల విలువైన 3.84 కిలోల బంగారంతో పాటు రూ. 24.22 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నాయి.

భారీ నిఘా ఆపరేషన్‌తో డంప్ గుర్తింపు..

నవంబర్ 27న భైరమ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భారీగా నగదు, బంగారాన్ని భూమిలో దాచినట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో బీజాపూర్ ఎస్పీ ఉమేశ్ ప్రసాద్ గుప్తా ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) రవీంద్ర కుమార్ మీనా నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.



స్టీల్ పెట్టెలో 33 బంగారు బిస్కెట్లు..

ఈ క్రమంలో భూమిలో పాతిపెట్టిన స్టీల్ పెట్టె బయటపడింది. దానిని తెరిచి చూడగా 10 తులాల బరువున్న 33 బంగారు బిస్కెట్లు లభించాయి. వీటి మొత్తం బరువు 330 తులాలు (సుమారు 3.84 కిలోలు). వీటి మార్కెట్ విలువ సుమారు రూ. 4.29 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. బంగారంతో పాటు టేపుతో చుట్టి ఉంచిన ప్యాకెట్‌లో రూ. 24,22,500 నగదు లభించింది. ఇందులో ఎక్కువగా రూ. 500 నోట్లు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బంగారం, నగదుపై భైరమ్‌గఢ్ పోలీస్‌స్టేషన్‌లో చట్టపరమైన చర్యలు చేపట్టారు.

భిక్కనూరులో వీధి కుక్కల దాడి

. . . 32 మేక పిల్లలు మృతి

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పశువైద్యురాలు డాక్టర్ జనుగం దివ్యశ్రీ





బిక్కనూర్, బతుకమ్మ :బిక్కనూరు మండల కేంద్రంలో వీధి కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలను శనివారం మండల పశు వైద్యాధికారిని దివ్యశ్రీ తాసిల్దార్ సునీత, సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత పాడి రైతులు సిద్దిరాములు, రాములును వారు ఓదార్చారు. జీవనోపాధి కోసం పెంచుకుంటున్న మేక పిల్లలు ఒకేసారి మృత్యువాత పడటంతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ దివ్యశ్రీ మాట్లాడుతూ మృతి చెందిన మేక పిల్లలకు నిబంధనల ప్రకారం పోస్టుమార్టం నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు. అలాగే మిగిలిన జీవాలకు వీధి కుక్కల బారి నుండి రక్షణ కల్పించుకోవడానికి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పశు సంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు జిల్లా టెస్ట్ విజయవంతం



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిజామాబాద్ లో గల కాకతీయ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక జిల్లా లెవెల్ సైన్స్ టెస్ట్ ను ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్ లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెరుకూరి రామోజీరావు కాకతీయ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్, అదేవిధంగా ఎర్రం గణపతి సీనియర్ న్యాయవాది, చెలిమల రాజేశ్వర్, బాస రాజేశ్వర్, శ్రీహరి ఆచార్య, డా.రవీంద్రనాథ్ సూరి, డాక్టర్ సృజిల్ బాబు హాజరయ్యారు. రాష్ట్ర స్థాయి కి విజయీ హై స్కూల్ విద్యార్థులు, జడ్పీహెచ్ ఎస్ అంక్కాపూర్, మామిడిపల్లి మోడల్ హై స్కూల్ ఎంపికయ్యారు.జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ పులి జైపాల్, అధ్యక్షులు సక్కి ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బంటు అజయ్, కోశాధికారి పండరి, చెకుముకి కన్వీనర్ మల్లని శివ, ఉమర్ అలీ పాల్గొన్నారు. పాఠశాలలో జన విజ్ఞాన వేదిక జిల్లా లెవెల్ సైన్స్ టెస్ట్ ను ప్రారంభించారు. అనంతరం పిల్లలకు సర్టిఫికెట్ లను ప్రధానం చేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను కూడా ప్రధానం చేశారు.

బాల్య వివాహాల నిర్మూలనకు క్యాండిల్ ర్యాలీ

నవీపేట్, బతుకమ్మ :బాల్య వివాహాల నిర్మూలన, బలవంతపు వివాహాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సాధన సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్, బలవంతపు వివాహాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా నవీపేట్ శ్రీనగర్ కాలనీలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీలో అవగాహన సదస్సు, క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలల హక్కులు, విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై వాటి ప్రభావం గురించి వివరించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన నినాదాలతో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు



అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో లక్ష్మారెడ్డి



ఆలూర్, బతుకమ్మ :ఆలూర్ మండలం డికంపల్లి గ్రామంలో ఎంపీడీవో లక్ష్మారెడ్డి పర్యటించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి, పంచాయతీ నిర్వహణకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీవో బిల్డింగ్ పనులను పరిశీలించడంతో పాటు కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించి మార్కౌట్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని, చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, వీవో బిల్డింగ్, కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, పారదర్శకమైన పాలనతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

ఘనంగా మహాత్మా జ్యోతి రావు పూలే వర్ధంతి



ఇందూర్, బతుకమ్మ : మాల మహానాడు ఆధ్వర్యంలో పూలే వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది డా. పులి జైపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్య అవసరం అని ఆ రోజుల్లోనే సత్య శోధక పాఠశాలలు ఏర్పాటు చేసి ఎంతో మంది మహిళలకు విద్యను అందించిన మహా గొప్ప సంఘ సంస్కర్త అని వారన్నారు. ప్రతి ఒక్కరూ పూలే ఆశయాలను కొనసాగించాలి అని వారు కోరారు. ఈ కార్యక్రమం లో మాల మహానాడు అధ్యక్షులు దేవిదాస్, నాంది వినయ్, రాజన్న, బొడ్డు లక్ష్మణ్, మక్కం గంగాధర్, భూమన్న, నారాయణ, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థులు

ఆరుగురు విద్యార్థుల ఎంపిక.. నవంబర్ 28 నుంచి వనపర్తిలో పోటీలు
సిరికొండ బతుకమ్మ : ఎస్ఏఎఫ్ అండర్-14 బాలుర రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. మారుతి, రణధీర్, విజయ్, దివాకర్, నిశ్వంత్, రితీక్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల పీడీ సదక్ నగేశ్ తెలిపారు. ఈ పోటీలు నవంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు వనపర్తి జిల్లాలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో రాములు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం మనోహర్, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ రాజేందర్ ,ఉపసర్పంచ్ శ్రీకాంత్ అభినందించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



ఘనంగా ముగిసిన కార్తీక ప్రభాత ఫేరి





35 రోజుల పాటు మద్నూర్ వీధులన్నీ హరినామ సంకీర్తనలు

ప్రత్యేక ఆకర్షణగా జంగమ మహేశ్వరుల పాదపూజ, గోమాత, శునకం భాగస్వామ్యం

మద్నూర్, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో గత 35 రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న కార్తీక మాస ప్రభాత ఫేరి శనివారం గ్రామం చుట్టూ నిర్వహించిన నగర ప్రదక్షిణతో వైభవంగా ముగిసింది. ప్రతిరోజూ తెల్లవారుజామున స్థానిక బాలాజీ మందిరం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర, గ్రామంలోని వివిధ కాలనీలు, ఆలయాల మీదుగా సాగింది. చివరి రోజు కావడంతో గ్రామ పరిధి చుట్టూ భారీ ఎత్తున నగర ప్రదక్షిణ నిర్వహించారు. వందలాది మంది భక్తులు భజనలు, శంఖనాదాలతో పాల్గొనగా, గ్రామస్థులు పూల వర్షం కురిపిస్తూ మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. జంగమ మహేశ్వరులు సంగయ్యప్పకు భక్తులు నిర్వహించిన పాదపూజలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఆకట్టుకున్న మూగజీవుల భక్తి..

తరలివచ్చిన ప్రతినిధులు:

ఈ 35 రోజుల పాటు ప్రతిరోజూ ఒక శునకం భక్తుల వెంట నడవడం, ప్రారంభంలో గోమాత రావడం విశేషంగా నిలిచాయి. సోషల్ మీడియా ద్వారా ఈ కార్యక్రమ విశేషాలు తెలుసుకున్న ఇస్కాన్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు సైతం మద్నూర్‌కు తరలివచ్చి భజనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగయ్యప్ప మాట్లాడుతూ.. ప్రభాత ఫేరి ద్వారా గ్రామంలో ఐక్యత, సోదరభావం పెంపొందుతాయని, నేటి తరం పిల్లలకు మన సంప్రదాయాలు, గురువుల పట్ల గౌరవం నేర్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళలు, యువత, చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసిన బాలసభ

సిరికొండ బతుకమ్మ : సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, వారిలో ఆత్మవిశ్వాసం, వాక్చాతుర్యం, కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా బాలసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఉప ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సౌమిత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. మధురమైన గీతాలు ఆలపిస్తూ, చక్కని కవితలు వినిపిస్తూ, ఆకట్టుకునే నాటికలు, నృత్య ప్రదర్శనలతో సభికులను అలరించారు. ప్రతి విద్యార్థి తనదైన శైలిలో ప్రతిభను చాటుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఉప ప్రధానోపాధ్యాయురాలు



సౌమిత్రి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి సరైన వేదిక కల్పించినప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాహిత్యం, సంగీతం, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు.బాలసభ అనేది కేవలం వినోద కార్యక్రమం మాత్రమే కాదని, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచనలు, భావవ్యక్తీకరణ, సమయస్ఫూర్తి, సామాజిక స్పృహ వంటి విలువలను పెంపొందించే గొప్ప వేదిక అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పుస్తక జ్ఞానంతో పాటు జీవితానికి అవసరమైన నైపుణ్యాలను అలవర్చుకోవడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలు, చక్కటి భావవ్యక్తీకరణతో బాలసభ ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య కొనసాగింది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ తాయని ఉపాధ్యాయ బృందం అభిప్రాయపడింది.ఈ కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయురాలు సౌమిత్రి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రైనీ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన విజయవంతం

నిజామాబాద్, బతుకమ్మ : ఆలిండియా సర్వీసెస్ ట్రైనీ అధికారులు తమ శిక్షణలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో క్షేత్రస్థాయి సందర్శనను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. 14 మందితో కూడిన ట్రైనీ అధికారులు ఈ నెల 21 నుండి 28 వరకు ఆర్మూర్ డివిజన్ లోని అంకాపూర్, బోధన్ డివిజన్ లోని భూలక్ష్మి క్యాంపు గ్రామాలలో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుతెన్నులను, ప్రజల జీవన స్థితిగతులను నిశితంగా పరిశీలన జరిపారు. క్షేత్రస్థాయి సందర్శన పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ట్రైనీ అధికారులు అలోక్ సింగ్, లోకేష్ మనోహర్ పాటిల్, మనిష్ పరిహార్, ప్రవీణ్ కుమార్, సచిన్ గోయెల్, శివం, రోమేల్ బిజల్వాన్, అభిషేక్ పరిహార్, దీపక్ శర్మ, నిహాల్ చంద్, పూజా మీనా, శుభం శుభ్, వికాస్ యాదవ్, నిధి కరన్వాల్ లు అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ను మర్యాదపూర్వకంగా ఆయన ఛాంబర్ లో కలిసారు. అదనపు కలెక్టర్ వారికి స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. క్షేత్రస్థాయి.సందర్శనలో గమనించిన అంశాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు గురించి ట్రైనీ అధికారులు అదనపు కలెక్టర్ తో తమ అనుభవాలను పంచుకున్నారు.



క్షేత్రస్థాయి సందర్శనలో గమనించిన విషయాలను ఆకళింపు చేసుకోవాలని, విధుల నిర్వహణ సందర్భంగా ఈ అంశాలు ఉపయుక్తంగా నిలుస్తాయని అదనపు కలెక్టర్ సూచించారు.

జనభేరి గోడ ప్రతులను ఆవిష్కరించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :దేశవ్యాప్తంగా జరుగుతున్న జన గణన ప్రశావళిలో ఓబీసీ కాలం చేర్చాలని చేపట్టే బీసీల జనభేరీ కార్యక్రమ గోడప్రతులను శనివారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 14వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న "బీసీల జనభేరి" కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా నుండి బీసీ బిడ్డలందరూ పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. వంద సంవత్సరాల కిందట ఎప్పుడో బ్రిటిషర్సు జరిపిన బీసీ కుల గణన తప్పితే అప్పటినుండి ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా బీసీల కులగణన చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. 2025 ఏప్రిల్ 1న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ లో బీసీ కులగణన చేయాలని నిర్ణయం తీసుకొని కూడా ఇప్పుడు జరుగుతున్న జాతీయ కుల గణనలో ఓబీసీల కాలం లేకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తమ మాటను నిలబెట్టుకొని జాతీయ కుల గణనలో ఓబీసీ కాలమును చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తో పాటు దర్శనం దేవేందర్, కరిపే రవీందర్, కొయ్యాడ



శంకర్, బగ్గలి అజయ్, శ్రీలత, నరేష్, గంగాధర్, శ్రీనివా,స్ సత్యనారాయణ, సురేందర్ మురళి అనిల్ గోపి అంకంరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా విప్లవానికి పునాదులు వేసిన దార్శనికుడు మహాత్మ జ్యోతిరావ్ పూలె









నేటి సమాజానికి పూలె ఆశయాలు ఆచరణీయం

తెలంగాణ విశ్వవిద్యాలయం

అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. అక్కెనపల్లి పున్నయ్య

సిరికొండ, బతుకమ్మ : భారత సామాజిక విప్లవోద్యమ పితామహుడు, సత్యశోధక్ సమాజ్ స్థాపకుడు, జ్ఞానజ్యోతి మహాత్మ జ్యోతిరావ్ పూలె 136వ వర్ధంతి వేడుకలను సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సత్యశోధక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్. నర్సయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా తెలంగాణ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. అక్కెనపల్లి పున్నయ్య, విశిష్ట అతిథిగా తెలంగాణ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా. వాసం చంద్రశేఖర్ హాజరయ్యారు.గౌరవ అతిథులుగా సిరికొండ తహసీల్దార్ రవీందర్ రావు, జక్రాన్‌పల్లి మండల విద్యాధికారి శ్రీనివాస్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్, స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె. సాల్మాన్, టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం. బాలయ్య, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, తిరుపతి, గణజ్యోతి, షేక్ పర్వీన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్, నిజామాబాద్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగామోహన్, తపాస్ మండల అధ్యక్షుడు కిరణ్, ట్రస్మా నాయకులు ముజీబ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.మొదటగా అతిథులందరూ కలిసి మహాత్మ జ్యోతిరావ్ పూలె చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి డా. అక్కెనపల్లి పున్నయ్య మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావ్ పూలె భారతదేశ సామాజిక విప్లవోద్యమంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించిన మహనీయుడని, విద్య ద్వారానే సామాజిక దురాచారాలు, మూఢనమ్మకాలు, అసమానతల నుంచి సమాజానికి విముక్తి కల్పించవచ్చని నమ్మిన గొప్ప దార్శనికుడని పేర్కొన్నారు. మహిళలకు, అణగారిన వర్గాలకు విద్యను దూరం చేసిన ఆనాటి సామాజిక పరిస్థితులను ఎదిరించి, తన సతీమణి సావిత్రిబాయి పూలెతో కలిసి బాలికల విద్య కోసం పాఠశాలలను స్థాపించడం ద్వారా భారతదేశంలో విద్యా విప్లవానికి పునాదులు వేశారని కొనియాడారు. అనంతరం సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి కులవివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూ సమానత్వం, మానవత్వం, హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని సమాజానికి అందించారని వివరించారు. మహాత్మ జ్యోతిరావ్ పూలె చూపిన మార్గంలోనే భాగ్యరెడ్డి వర్మ, కందుకూరి వీరేశలింగం వంటి సంఘ సంస్కర్తలు కూడా సమాజ అభ్యున్నతికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు.ఎన్నో సామాజిక అవరోధాలు, ఒడిదొడుకులను అధిగమించి విద్యావ్యాప్తి కోసం మహాత్మ జ్యోతిరావ్ పూలె చేసిన పోరాటం నేటి తరానికి గొప్ప స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు పరిచయం చేస్తూ, విద్యార్థుల్లో సామాజిక స్పృహ, ప్రతిభ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో సత్యశోధక్ పాఠశాల నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు అండగా నిలుస్తూ వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, భవిష్యత్తులో ఇదే పాఠశాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసి తమ తల్లిదండ్రుల పేర్లతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల పేరును కూడా నిలబెట్టాలని ఆకాంక్షించారు. సత్యశోధక్ పాఠశాల ప్రస్తుత స్థాయి నుంచి మరింత అభివృద్ధి చెంది భవిష్యత్తులో విశ్వవిద్యాలయ స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని, ఈ పాఠశాలను తన సొంత విద్యాసంస్థగా భావిస్తున్నానని పేర్కొంటూ పాఠశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.విశిష్ట అతిథి డా. వాసం చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతదేశంలో సామాజిక సమానత్వం, విద్యావ్యాప్తి, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మ జ్యోతిరావ్ పూలె చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూ విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని నిరూపించిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావ్ పూలె అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉత్పత్తి కులాలు, అణగారిన వర్గాల నుంచి ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నత స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందని, నేటి సమాజానికి శాస్త్రీయ దృక్పథం కలిగిన వ్యక్తులు, పరిశోధకులు ఎంతో అవసరమని అన్నారు. మహాత్మ జ్యోతిరావ్ పూలె స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్య ద్వారా సామాజిక మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో సత్యశోధక్ పాఠశాలను స్థాపించి ముందుకు సాగుతున్న చైర్మన్ ఆర్. నర్సయ్యను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకొని శాస్త్రీయ ఆలోచనా విధానంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.మహాత్మ జ్యోతిరావ్ పూలె వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించిన మహాత్మ జ్యోతిరావ్ పూలె స్మారక సిరికొండ మండల స్థాయి ప్రజ్ఞా పాటవ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. గత విద్యా సంవత్సరం (2025-26) ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ పరీక్షల్లో సిరికొండ మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు రావుట్ల చిన్న నర్సయ్య స్మారక సత్యశోధక్ నగదు పురస్కారాలు, ఉత్తమ విద్యార్థి అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించి ఘనంగా సత్కరించారు.ఎస్-ఎస్సీలో సిరికొండ మండల టాపర్‌గా నిలిచిన ఎం. సుదీప్తి (582/600), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిరికొండకు రూ.5,000 నగదు పురస్కారం అందజేశారు. ద్వితీయ టాపర్‌గా నిలిచిన ఆర్. నితిన్ (578/600), గిరిజన గురుకుల బాలుర పాఠశాల, చిమన్‌పల్లికి రూ.3,000 నగదు పురస్కారం అందించారు.ఇంటర్మీడియట్‌లో మండల టాపర్లుగా నిలిచిన ఆర్. భరత్ (928/1000), ఎంపీసీ, గిరిజన గురుకుల బాలుర పాఠశాల, చిమన్‌పల్లి, టి. శృతిక (928/1000), బైపీసీ, పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ కళాశాల, సిరికొండలకు ఒక్కొక్కరికి రూ.3,000 చొప్పున రావుట్ల చిన్న నర్సయ్య స్మారక నగదు పురస్కారాలు అందజేశారు. వీరితో పాటు ఉత్తమ విద్యార్థి అవార్డులు, ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు.

ప్రత్యేకంగా సత్యశోధక్ పాఠశాల టాపర్‌గా నిలిచిన కె. శ్రీనిధి (576/600)కి తాహెర్ బిన్ హందాన్ నగదు పురస్కారం కింద రూ.5,000తో పాటు ఉత్తమ విద్యార్థి అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

అదేవిధంగా ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఆయా పాఠశాలలు, కళాశాలల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు. వారిలో సిహెచ్. అక్షిత (573/600) మహాత్మ జ్యోతిరావ్ పూలె బాలికల పాఠశాల, చిమన్‌పల్లి; జి. అభిజ్ఞ (572/600) పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, సిరికొండ; సిహెచ్. సాహితి (571/600) ప్రతిభ హైస్కూల్, సిరికొండ; పి. సాహితి (567/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రావుట్ల; ఎస్. శశాంక్ (564/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిమన్‌పల్లి; ఎన్. విజ్ఞశ్రీ (561/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొండపూర్; బి. శ్రీనిధి (560/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తూంపల్లి; బి. అరవింద్ (555/600) గిరిజన ఆశ్రమ పాఠశాల, సిరికొండ; పి. హర్షవర్ధన్ (554/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గడ్కోల్; డి. ప్రణతి (554/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, న్యావనంది; ఎం. రహత్ (552/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాళ్ల రామడుగు; పి. శ్రీవర్షిణి (523/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్ద వాల్తోట్; బి. శ్రీజ (513/600) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొండూర్; కె. సంధ్య (511/600) కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, పెద్ద వాల్తోట్; బి. నితిన్ (915/1000) కామధేను జూనియర్ కళాశాల, సిరికొండ ఉన్నారు.

ఈ సందర్భంగా అతిథులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మహాత్మ జ్యోతిరావ్ పూలె ఆశయాలైన విద్య, సమానత్వం, సామాజిక న్యాయాన్ని భావితరాలకు అందించడంతో పాటు విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ యాజమాన్యాన్ని అభినందించారు.

చలో ఢిల్లీకి బయలుదేరిన జిల్లా సిఐటీయు కార్యకర్తలు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : డిసెంబర్ 1,2,3 తేదీలలో కార్మిక ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిఐటీయు తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా నుండి కార్మికులు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. జిల్లా నుండి సుమారు 100?మంది కార్మిక ప్రతినిధులు వెళ్లారని సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు అన్నారు. కార్మికులకు కనీస వేతనం 42,000?నిర్ణయించాలని కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారికి పి.ఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్స్ సౌకర్యాలను రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను అమలు జరపాలని తదితర డిమాండ్లతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రైవేటీకరణ విధానాలను ఆపాలని పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలను అదుపు చేయాలని సిఐటీయు ఆల్ ఇండియా కమిటీ మూడు రోజులపాటు ఆక్యుపై ఢిల్లీ అనే నినాదంతో ఇచ్చిన పిలుపులో దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు పాల్గొంటున్నారన్నారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రం నుండి కూడా పెద్ద ఎత్తున కార్మికులు గత మూడు రోజుల నుండి బయలుదేరి వెళ్లడం జరుగుతుందని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మిక సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనం 42 వేలు?నిర్ణయించాలని, లేనియెడల దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని ఆయన తెలిపారు.చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఆటంకాలు కల్పించిన ఎడల దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. చలో



ఢిల్లీకి బయలుదేరిన వారిలో సిఐటీయు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఉపాధ్యక్షులు జంగం గంగాధర్, మోహన్, జిల్లా కమిటీ సభ్యులు గణేష్, నరసయ్య, గోదావరి, సావిత్రితో పాటు వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా దరఖాస్తుల స్వీకరణ



సిరికొండ బతుకమ్మ : మండలంలోని తాళ్ల రామడుగు గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. శనివారం ఉదయం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా, ఇప్పటివరకు మొత్తం 82 దరఖాస్తులు అందినట్లు గ్రామ సర్పంచ్ వరలక్ష్మి సంతోష్ తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన కుటుంబాలన్నీ ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కారోబార్ గంగాధర్, ఆపరేటర్ నవ్య పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసిన టీఎన్జీవో నాయకులు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : సాంఘిక సంక్షేమ శాఖ (సోషల్ వెల్ఫేర్) మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హుసేని (ముజీబ్) ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర సచివాలయంలో టీఎన్జీవోస్ పక్షాన మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా టీఎన్జీవో నాయకులు రాష్ట్రంలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో గల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఉద్యోగుల పదోన్నతులు, ఇతరత్రా సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారు. టీఎన్జీవో నాయకత్వం తెలిపిన న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పదోన్నతులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో టీఎన్జీవో పక్షాన హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో



టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఎంప్లాయిస్ జేఏసీ నిజామాబాద్ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ పాల్గొన్నారు

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శులుగా మల్లయ్య, కృష్ణ కుమార్





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శులుగా మల్లయ్య, కృష్ణకుమార్ లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా రాష్ట్ర అధ్యక్షులు సదానందంగౌడ్ గారి ఆదేశానుసారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజేందర్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారు. వీరిని రాష్ట్ర కార్యవర్గంలో తీసుకున్న సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎస్టీయు బలోపేతం చేయడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎన్నికైన వారు తెలిపారు.

జస్టిస్ లక్ష్మణ్ గౌడ్‌ను పరామర్శించిన స్పెషల్ పి పి దయాకర్ గౌడ్



ఇందూర్, బతుకమ్మ : హై కోర్ట్ న్యాయమూర్తి కూనూరి లక్ష్మణ్ గౌడ్ కు పితృ వియోగం కావడంతో నల్లగొండ జిల్లా వలిగొండ మండలం బోగారం గ్రామంలో స్పెషల్ పిపి దయాకర్ గౌడ్ శనివారం పరామర్శించారు. ఈ నెల 23న ఆయన తండ్రి కూనూరు గోపాల్ గౌడ్ వృద్ధాప్య సమస్యలతో పరమపదించారు. లక్ష్మణ్ గౌడ్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో సీనియర్ న్యాయవాది హనుమంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ లు ఉన్నారు.

ఖమ్మం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు





వెబ్ డెస్క్, బతుకమ్మ :హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఖమ్మం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రామానుజవరం సమీపంలో డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై నిలిచిపోయిన లారీని ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదం లో 15 మంది ప్రయాణికులకు గాయాలు కాగా బస్సు డ్రైవర్ సహా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రమాదంతో హైవేపై నిలిచిన వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఘటనపై తల్లాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణజింక కొమ్ములను విక్రయించిన వ్యక్తి అరెస్టు



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని కృష్ణజింక కొమ్ములను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు నార్త్ ఎఫ్ఆర్ వో సంజయ్ గౌడ్ తెలిపారు. నగరంలోని నాందేవ్ వాడకు చెందిన వాలెం లోకేష్ అనే వ్యక్తి బ్లాక్ బక్ గా పేరు గాంచిన జింక కొమ్ములను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పట్టుకుని కొమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లోకేష్ కు కొమ్ముల గురించి విచారించగా మెదక్ జిల్లాలో తనకు లభ్యం కాగా వాటిని రైలులో నిజామాబాద్ వరకు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిపారన్నారు. ఈ మేరకు వన్యప్రాణి రక్షణ చట్టం కింద లోకేష్ పై కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా అతడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్ ఆర్ వో తెలిపారు.

నగరంలో న్యూడెమోక్రసీ భారీ ఊరేగింపు



ఇందూర్, బతుకమ్మ : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, బ్లాక్ మార్కెట్, కృత్రిమ కొరతను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. శివాజీ చౌక్ (ఆర్.ఆర్. చౌరస్తా) నుండి ప్రారంభమైన ఈ ఊరేగింపు బడా బజార్, హెడ్ పోస్ట్ ఆఫీస్, నెహ్రూ పార్క్,గాంధీ చౌక్, బస్టాండ్ మీదుగా ధర్నా చౌక్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ "ఎల్ నీనో పేరుతో పెంచుతున్న ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ప్రజలను ఆర్థిక ఊబి నుండి బయటకు తీసుకురావాల్సింది పోయి ధరల దోపిడీకి గురిచేస్తున్నాయని ఆరోపించారు. సరుకుల ఎగుమతులు, దిగుమతుల విషయంలో సరైన ప్రణాళిక లేదనీ, నిత్యావసర వస్తువుల నిల్వలపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడిందనీ అన్నారు. బ్లాక్ మార్కెట్, నిల్వదారుల ఆగడాలు పెరిగిపోతున్నాయన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం భారత ఆహార సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తోందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని కంపెనీ లకు, మల్టీ నేషనల్ కంపెనీలకు అప్పజెప్పే విధానాలు అమలు చేస్తున్నారనీ, 60 శాతం మందికి ఉపాధినిచ్చే వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసి, దేశ సంపదను ఐదుగురు బడా వ్యాపారవేత్తలకు కట్టబెడుతున్నారనీ, 200 కుటుంబాలు భారత్ ఆదాయాన్ని ఆక్రమిస్తుండగా, 6 లక్షలకు పైగా చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు మూతపడ్డాయని,లక్షల మంది కార్మికులు, చిన్న వ్యాపారులు రోడ్డున పడ్డారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలనీ?ని ల్వదారులుబ్లాక్ మార్కెట్ కృత్రి మ కొరత పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవానీ, రైతు - కూలీలకు రోజుకు 700 రూపాయల వేతనం ఇవ్వాలనీ,?వ్యవసాయ ఉత్పత్తులకు లాభసాటి మద్దతు ధర ఇవ్వాలనీ, బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు రూపాయల వేతనం ఇవ్వాలనీ యువతకు ఉపాధి సామాన్యులకు ఆర్థిక భరోసా కల్పించాలనీ డిమాండ్ చేశారు.ప్రజలకు అధిక ధరల నుండి విముక్తి కల్పించాల్సింది పోయి పాలక వర్గాలు దబ్బు సంపాదన, అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యం వల్ల సామాన్య ప్రజలు నష్టపోతున్నారని ఆకుల పాపయ్య అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వేల్పూరు భూమయ్య,?పరుచూరి శ్రీధర్, నీలం సాయిబాబా, బి. భూమన్న, సూర్య శివాజీ, ప్రజాసంఘాల నాయకులు ఆర్ గౌతమ్ కుమార్, శివకుమార్, మల్లికార్జున్, జేపీ గంగాధర్, ఆకుల అరుణ, జి.రమేష్, జన్నారపు రాజేశ్వర్, సత్యం సాయిరెడ్డి, బండమీద నర్సయ్య, భారతి, అబ్దుల్, సాయినాథ్, పార్వన్న, లక్ష్మి, సంజన, సాయగౌడ్, చిన్నయ్య, ప్రిన్స్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి జోలికి మళ్లే వెళ్లవద్దు

గంజాయి వ్యసనం నుంచి బయటపడిన బాధితులతో డీజీపీ సి.వి.ఆనంద్



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : గంజాయి వ్యసనానికి గురై?పోలీసుల సహకారంతో డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందిన బాధితులతో డీజీపీ సి.వి.ఆనంద్ సమావేశమై వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గంజాయి వ్యసనం నుంచి బయటపడిన బాధితులతో మాట్లాడారు. గంజాయి వినియోగం వల్ల గతంలో ఎదురైన ఇబ్బందులు, చికిత్స అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి, ప్రస్తుత జీవన విధానం, కుటుంబ సభ్యులతో సంబంధాలు, భవిష్యత్తు ప్రణాళికల గురించి వివరాలు తెలుసుకున్నారు. గంజాయి వ్యసనం నుంచి బయటపడేందుకు బాధితులు చేస్తున్న ప్రయత్నాలను అభినందిస్తూ ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని స్పష్టంగా సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని,కుటుంబ సభ్యుల సహకారంతో సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించాలని హితవు పలికారు. గంజాయి వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ, సామాజిక జీవితంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం ద్వారా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని, ఇతరులకు కూడా మంచి మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు.భవిష్యత్తులో బాధితులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినా లేదా మళ్లీ వ్యసనం వైపు వెళ్లే పరిస్థితి ఏర్పడినా వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలని డీజీపీ సూచించారు. వారికి అవసరమైన సహాయం, మార్గదర్శకత్వం అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడిన వారిని కేవలం నేరస్తులుగా చూడకుండా వారికి సరైన చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం కల్పించి తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని ఈ సందర్భంగా డీజీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గంజాయి వ్యసనం నుంచి బయటపడిన బాధితుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు, వారు తిరిగి వ్యసనానికి లోనుకాకుండా ఉండేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సహకారం భరోసా మరింత స్పష్టమైందన్నారు.

8మంది ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్, బతుకమ్మ : రాష్ట్రంలో 8 మంది ఐఏఎస్ లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలువురు ఐఏఎస్, నాన్‌కేడర్ అధికారులను బదిలీ చేస్తూ మరికొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా హైదరాబాద్ నగర అభివృద్ధి, మున్సిపల్ పరిపాలన, మెట్రో రైలు, మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులకు సంబంధించిన కీలక పోస్టుల్లో మార్పులు చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. సర్ఫరాజ్ అహ్మద్ కు హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ బాధ్యతల నుంచి బదిలీ చేసి మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. హెచ్ఎండీఏ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల ప్రత్యేక అధికారిగా కూడా బాధ్యతలు అప్పగించారు. ఈ.వి. నరసింహారెడ్డికి మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించడంతో పాటు హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా నియమించారు. బి.అజిత్ రెడ్డికి హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్వెస్ట్ తెలంగాణ, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ సీఈఓగా కొనసాగనున్నారు. మయాంక్ మిట్టల్ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న ఆయనకు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. కె. చంద్రకళకు హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా నియమించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు. ఐ.ఈ.ఎస్.ఎస్.డి. మనోజ్ ను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. పి.రామును స్టేట్ ఆడిట్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న ఆయనను విద్యాశాఖలో స్పెషల్ ఆఫీసర్ (ప్రాజెక్ట్స్)గా నియమించారు. వి.శ్రీనివాస్ రెడ్డి బదిలీ నేపథ్యంలో మాతృశాఖకు రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ బదిలీల్లో ప్రధానంగా హైదరాబాద్ నగర పాలన, పట్టణాభివృద్ధి, మెట్రో రైలు, మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన పోస్టుల్లో మార్పులు చోటుచేసుకోవడం గమనార్హం.

ఎంఎస్ పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామికి సన్మానం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఇంజశీ వెంకటస్వామి శనివారం మొదటిసారి నిజామాబాద్ జిల్లాకు వచ్చిన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట స్వామి మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎంఎస్ పీ పార్టీని బలోపేతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నానని తెలిపారు. సన్మానించిన వారిలో జాతీయ మాదిగ ఉద్యోగుల సమాఖ్య కోరు కమిటీ సభ్యులు రేణి కుంట నాంపల్లి, ఎంఎస్ పీ పార్టీ మాజీ అధ్యక్షులు సర్కిల పోశెట్టి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గంధమాల నాగభూషణం సన్మానించిన వారిలో ఉన్నారు.



మోపాల్‌లో ఆధునిక పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం అభినందనీయం





రైతులపై గతంలో నమోదైన కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకుంటాం

డీజీపీ సీవీ ఆనంద్

మోపాల్, బతుకమ్మ : నూతనంగా నిర్మించిన మోపాల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని రాష్ట్ర డీజీపీ సీ.వీ ఆనంద్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ మోపాల్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, సర్పంచులు, గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు నిత్యావసర సేవలు అందించే ముఖ్యమైన కార్యాలయాల్లో తహశీల్దార్ కార్యాలయంతో పాటు పోలీస్ స్టేషన్ కూడా ఒకటని పేర్కొన్నారు. అలాంటి కీలకమైన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించడం అభినందనీయమన్నారు. నిజామాబాద్ జిల్లా తనకు కొత్తేమీ కాదని, గతంలో ఇక్కడ పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం జిల్లాకు వచ్చినప్పుడు ప్రజలు చూపిన ఆత్మీయ స్వాగతం పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చిందన్నారు. తన కుమారుడు సైతం నిజామాబాద్ జిల్లాలో తాను పనిచేస్తున్న సమయంలోనే జన్మించాడని, ఆ అనుబంధంతోనే తన కుమారుడికి నిఖిల్ అని పేరు పెట్టినట్లు తెలిపారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధి విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున పరిపాలన, పోలీసింగ్ సౌలభ్యం కోసం ప్రత్యేకంగా ఎనిమిది పోలీస్ స్టేషన్లతో రూరల్ డివిజన్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగానే మోపాల్ నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలు శాంతియుత స్వభావం కలిగిన వారని, ఎన్నికలు సైతం ప్రశాంతంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తూ పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. గతంలో రైతులపై నమోదైన కేసుల అంశాన్ని ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకువ చ్చారని ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని డీజీపీ హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంబంధిత కేసుల విషయంలో తప్పకుండా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మల్టీ జోన్ ఐజీపీ కార్తికేయ, డిఐజి నారాయణ్ నాయక్, సిపి సాయి చైతన్య, ఏసీపీ ప్రకాష్, ఎస్ హెచ్ వో సుష్మిత, రాష్ట్ర గీతా పారిశ్రామిక సహకార కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, మోపాల్ మండల ప్రజాప్రతినిధులు, గ్రామాల సర్పంచులు, నాయకులు, పోలీసు సిబ్బంది,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రాంతాలన్నీ రూరల్ డివిజన్‌లోకి మార్చాలి

డీజీపీకి ఎమ్మెల్యే

డా. ఆర్. భూపతి రెడ్డి విజ్ఞప్తి

నిజామాబాద్ రూరల్, బతుకమ్మ : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని అన్నీ ప్రాంతాలను కొత్తగా ఏర్పాటు చేసిన నిజామాబాద్ రూరల్ పోలీసు డివిజన్ లోకి మార్చాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ కు విజ్ఞప్తి చేశారు. శనివారం నిజామాబాద్ రూరల్ డివిజన్ ఏసీపీ కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఈ మేరకు డీజీపీకి వినతి పత్రాన్ని సమర్పించారు. ఇందల్వాయి పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. డిచ్‌పల్లి 7వ పోలీస్ బెటాలియన్‌లో శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని, పోలీస్ స్టేషన్ల పరిధుల మార్పు, మౌలిక సదుపాయాల కల్పనపై డీజీపీకి విన్నవించారు. నిజామాబాద్ రూరల్, మోపాల్ పోలీస్ స్టేషన్ల పరిధులను ప్రజల సౌలభ్యం, పరిపాలనా అవసరాలు, శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని పునర్వ్యవస్థీకరించాలని కోరారు. ఇందులో భాగంగా ప్రస్తుతం నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జలాల్‌పూర్, మల్కాపూర్ (పి), పాలా గ్రామాలతో పాటు నిజామాబాద్ 6వటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రినగర్, సారంగాపూర్ ప్రాంతాలను నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రస్తుతం నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పాంగ్రా, మాధవ్‌నగర్ గ్రామాలతో పాటు నిజామాబాద్ 4వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోధాం (పి) గ్రామాన్ని మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చాలని కోరారు. ఈ మార్పుల ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు పోలీస్ సేవలు మరింత అందుబాటులోకి రావడంతో పాటు పోలీస్ పరిపాలన, శాంతిభద్రతల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా సాగుతుందని వివరించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంగా ఉన్న 7వ పోలీస్ బెటాలియన్‌లో 1975లో బెటాలియన్ ఏర్పాటైన నాటి నుంచి నిర్మించిన పలు భవనాలు ప్రస్తుతం



శిథిలావస్థకు చేరుకున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ముఖ్యంగా పరిపాలనా భవనం, స్టాఫ్ క్వార్టర్స్ పాతబడిపోవడంతో పోలీస్ సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తులపై డీజీపీ సీవీ ఆనంద్ సానుకూలంగా స్పందించారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్



నందిపేట్, బతుకమ్మ : నందిపేట్ లో భర్తను హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 26న జరిగిన హత్య కేసును ఆర్మూర్ రూరల్ సర్కిల్ పోలీసులు కేసును ఛేదించారు. మృతుడు గోసం గంగాధర్ (45)ను హత్య చేసిన కేసులో అతని భార్య గంధం సుమలతను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సిఐ జాన్ రెడ్డి తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గోసం గంగాధర్ మద్యానికి బానిసై, ఎలాంటి పని చేయకుండా నిత్యం తన భార్య సుమలతను, పిల్లలను శారీరకంగా, మానసికంగా వేధించేవాడని తెలిపారు. ఈ విషయాన్ని కుల పెద్దలుఎన్ని సార్లు నచ్చజెప్పినప్పటికీ గంగాధర్ ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. దీంతో ఈ నెల 26న ఉదయం మృతుడు మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య సుమలత పై దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా అదే రోజు సాయంత్రం 4గంటల సమయంలో మద్యం మత్తులో ఉన్న గంగాధర్ మళ్ళీ గొడవకు దిగడంతో అతని వేధింపులు భరించలేక సుమలత అతనిని కింద పడేసి, చేతులతో గట్టిగా గొంతు నులిమి హత్య చేసినట్లు తెలిపారు. అనంతరం నిందితురాలు కోరుట్ల పట్టణానికి పారిపోవడానికి ప్రయత్నిస్తున్న నిందుతురాలిని ఆర్మూర్ రూరల్ సి.ఐ జాన్ రెడ్డి, నందిపేట్ పోలీసు సిబ్బంది పలుగుట్ల వద్ద అదుపులోకి తీసుకొని విచారించిగా నిందితురాలు తన నేరాన్ని అంగీకరించినట్లు సిఐ జాన్ రెడ్డి పేర్కొన్నారు

అయ్యప్ప సామూహిక మహా పడిపూజ

ఏర్గట్ల,బతుకమ్మ:ఏర్గట్ల మండలంలోని దోంచంద గ్రామం గోనేకాపు కళ్యాణ మండపంలో అయ్యప్ప స్వామి సామూహిక మహా పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో మండలంలోని అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వాముల భిక్ష కార్యక్రమాన్ని జరిపారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులు తెల్ల యమునకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైన సందర్భంగా శనివారం గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో గుండూరు ప్రశాంత్ గౌడ్, కండూర్ రాజు, బర్ల చిట్టి, శంకర్, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేయడం నేరం ..



ఇందల్వాయి,బతుకమ్మ :బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక సమస్యలు భవిష్యత్తులో ఉత్పన్నం అవుతాయని బాల్యవివాహాల నిర్మూలన సాధన సమితి ఆధ్వర్యంలో ఇందల్వాయి మండలంలోని గంగారాం తాండ లో అవగాహన సదస్సు నిర్వహించారు, ఈ అవగాహన సదస్సుకు గంగారం తండా సర్పంచ్ సంగీత దిలీప్ కుమార్ అధ్యక్షత వహించగా సాధన సమితి జిల్లా కోఆర్డినేటర్ డి వినేష్ కుమార్ హాజరయ్యారు, ఈ సందర్భంగా సర్పంచ్ సంగీత దిలీప్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు, బాల్య వివాహన నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు, ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే తక్షణమే టోల్ ఫ్రీ నెంబర్ 10 98 నెంబర్ కు సమాచారం అందించాలని ఆమె ఈ సందర్భంగా గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు, బాల్య వివాహాలు చేయడం వల్ల పిల్లల భవిష్యత్తుతోపాటు ఆరోగ్య సమస్యలు తదితర సమస్యలు పెరుగుతాయి అన్నారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధూమ నాయక్, మాజీ సర్పంచ్ బలరాం నాయక్, వార్డు సభ్యులు బాబూలాల్ నాయక్, గణేష్ నాయక్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, కరోబార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

భూముల రీ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

బిఆర్డీవో రాజేందర్

ఇందల్వాయి ,బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భూముల రీ సర్వే ను ప్రభుత్వం కొనసాగిస్తుండగా శనివారం ఇందల్వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన భూముల రీ సర్వే అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా నిజామాబాద్ ఆర్డిఓ రాజేందర్ హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భూముల రీ సర్వే ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, తమ భూములు ఇతరుల పేర్లపై ఉన్న లేదా పట్టా పాస్ బుక్ లో ఎక్కకపోయినా తహసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు, భూముల రీ సర్వేలో ప్రతి ఒక్కరూ పారదర్శకంగా పనిచేయాలని రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి డబ్బులు డిమాండ్ చేసిన లేదా ప్రజలను ఇబ్బంది పెట్టిన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో మల్లాపూర్ సర్పంచ్ తో పాటు, తాసిల్దార్ బాలయ్య, ఉప సర్పంచ్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు



క్రీడలు ... బ్యాండ్ ... పోలీసుల ప్రతిష్ఠకు ప్రతీక

ఆల్ ఇండియా పోలీస్ క్రీడా పోటీల్లో రాణించేలా ప్రతిభావంతులను తీర్చిదిద్దాలి

ముగింపు వేడుకల్లో డీజీపీ సి.వి. ఆనంద్

పురుషులు, మహిళల విభాగాల్లో హైదరాబాద్ సిటీకి ఓవరాల్ ఛాంపియన్‌షిప్

మహిళల విభాగంలో రన్నరప్‌గా బాసర జోన్, టీజీపీఏ జోన్--2

పురుషుల విభాగం రన్నరప్‌గా టీజీఎస్పీ జోన్ 2 గా నిలిచాయి

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : పోలీసు సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయస్థాయిలో రాణించేలా ప్రోత్సహించేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాలని డీజీపీ సి.వి. ఆనంద్ సూచించారు. తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠాత్మకంగా ఐదు క్లస్టర్లుగా నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని సీటీసీ జానకంపేటలో అంగరంగ వైభవంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన 27 ఏళ్ల సర్వీసులో మూడున్నరేళ్లపాటు నిజామాబాద్‌లో పనిచేశానని గుర్తుచేసుకున్నారు. తనకు ఎంతో ఇష్టమైన క్రీడా కార్యక్రమానికి ఇక్కడ హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. ఈసారి కొత్త విధానాన్ని ప్రవేశపెట్టామని, ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కు అనుసంధానంగా తెలంగాణ పోలీస్ క్రీడా బృందాలను సిద్ధం చేసే దిశగా చర్యలు చేపట్టామన్నారు. క్రీడల్లో ప్రతిభ ఉన్నవారిని గుర్తించి, ప్రత్యేక శిక్షణతో జాతీయస్థాయి పోటీల్లో రాణించేలా తీర్చిదిద్దాలన్నారు.



అన్ని క్రీడాంశాల్లో ప్రతిభావంతులతో జట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఐదు క్లస్టర్లుగా పోటీలు

గతంలో ఒకేచోట క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల పాల్గొనే వారికి పరిమిత అవకాశాలు ఉండేవని, ఈసారి ఎక్కువ మంది పోలీసు సిబ్బందికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఐదు క్లస్టర్లుగా విభజించి వివిధ ప్రాంతాల్లో పోటీలు నిర్వహించామన్నారు. జులై 7న మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇండోర్ క్రీడలు నిర్వహించగా



సుమారు 700 మంది పాల్గొన్నారని తెలిపారు. నవంబర్ 2, 3 తేదీల్లో వరంగల్‌లో వాలీబాల్, ఫుట్‌బాల్ వంటి టీమ్ క్రీడల్లో సుమారు 500 మంది పాల్గొన్నారన్నారు. మరో క్లస్టర్‌లో రాకెట్ క్రీడలైన టెన్నిస్, బ్యాడ్మింటన్ తదితర పోటీలకు సుమారు 700 మంది హాజరయ్యారని వివరించారు. చివరి క్లస్టర్‌గా నిజామాబాద్‌లో నిర్వహించిన పోటీల్లోనూ సుమారు 585 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు.

పెరిగిన క్రీడాకారుల సంఖ్య

గతంలో కరీంనగర్‌లో నిర్వహించిన క్రీడల్లో సుమారు 2,200 మంది, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జరిగిన పోటీల్లో 2,530 మంది పాల్గొన్నారని డీజీపీ గుర్తుచేశారు. ఈసారి ఐదు క్లస్టర్లలో కలిపి మొత్తం 3,815 మంది క్రీడాకారులు పాల్గొనడం విశేషమన్నారు. గతంతో పోలిస్తే క్రీడాకారుల సంఖ్య గణనీయంగా పెరగడం, ఎక్కువ మందికి తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభించడం ఈ విధానం విజయవంతమైనట్లు స్పష్టం చేస్తోందన్నారు. ఇంటెలిజెన్స్, ఐఎస్‌డబ్ల్యూ తదితర విభాగాలను కూడా సమన్వయం చేసి ప్రతిభ ఆధారంగా సమర్థమైన జట్లను రూపొందించాలని సూచించారు. పోలీసు విధుల్లో క్రీడలు కీలక భాగమని, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. క్రీడా



కార్యక్రమాలను నిర్వహించేటప్పుడు లాభనష్టాల కోణంలో చూడకూడదని, కొన్ని కార్యక్రమాల వల్ల ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనం లేకపోయినా పోలీసు శాఖలో సంప్రదాయాలను, ఉత్సాహాన్ని, ప్రతిభను పెంపొందించేందుకు అవి అవసరమని అన్నారు. బ్యాండ్, మౌంటెడ్ పోలీసు వంటి విభాగాల నిర్వహణ కూడా పోలీసు శాఖ ప్రత్యేకతను చాటుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దడంలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి స్థాయిలోనూ సిబ్బందిని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

విజేతలు

పురుషులు, మహిళల విభాగాల్లో హైదరాబాద్ సిటీకి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ లో మహిళల విభాగంలో రన్నరప్‌గా బాసర జోన్, టీజీపీఏ జోన్--2, పురుషుల విభాగం రన్నరప్‌గా టీజీఎస్పీ జోన్ 2 గా నిలిచాయి. ఈ క్రీడాల నిర్వహణకు విశేష కృషి చేసిన స్పోర్ట్స్ ఐజీ గజరావ్ భూపాల్, ఆతిథ్యం కల్పించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో పాటు వివిధ విభాగాల అధికారులు, పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం విజేతలకు బహుమతులు, పతకాలు అందజేసి అభినందించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బజార్ కొత్తూరులో బీఆర్ఎస్ గ్రామ శాఖ సమావేశంలో మండల అధ్యక్షులు మచ్చర్ల సాగర్

నందిపేట్, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు నందిపేట్ మండలం బజార్ కొత్తూరు గ్రామంలో నందిపేట్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్ ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి పార్టీ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో నూతనంగా చేరిన యువకులు, నాయకులకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో మచ్చర్ల సాగర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో గత పదేళ్ల పాలనలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని మచ్చర్ల సాగర్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి



ప్రభుత్వం రైతు వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వీర్యం చేస్తూ తెలంగాణ ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని విమర్శించారు. గతంలో దేశంలోనే అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందంజలో నిలిచిన తెలంగాణ రాష్ట్రాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడేలా చేసిందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాలగంగాధర్, మాజీ సర్పంచ్ బాబు రాజ్, గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీనివాస్, కొత్తూరు భరత్, వార్డు సభ్యులు పాషా, తాటికాయల సాగర్, గణేష్, మొగులాజి దామోదర్, రవి, తేలు భోజన్న, సాయికుమార్, నరసయ్య, ప్రభాకర్, శ్రీనివాస్, నరేష్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగల కార్తీక కోటి దీపోత్సవం

వేలాది దీపాల వెలుగుల్లో ఆధ్యాత్మిక శోభ.
సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం.
అన్నమయ్య కీర్తనలతో మార్మోగిన ప్రాంగణం
వైభవంగా శ్రీ స్వామివారి కల్యాణోత్సవం

భీమ్‌గల్ , బతుకమ్మ : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలో కోటి కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని కన్నుల పండుగల నిర్వహించారు. ఈ కార్తీక దీపోత్సవ కార్యక్రమంతో పట్టణం దీపాల కాంతులతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీరామ సేవా మండలి నంబి వాసుదేవాచార్యులు, యోగ బృందం ఆధ్వర్యంలో సరస్వతి విద్యామందిర్ మైదానంలో కార్తిక కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీపాల వెలుగులతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకోగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంతో దీపారాధన చేశారు.కార్యక్రమానికి తొలుత పురోహితులు గణపతి ప్రార్థనతో శ్రీకారం చుట్టి, శాస్త్రోక్తంగా దీపారాధన నిర్వహించారు. అనంతరం భక్తులందరూ కలిసి సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేయడంతో ప్రాంగణం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. అన్నమయ్య సంకీర్తనలు భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తాయి. చిన్నారులు ప్రదర్శించిన పేరిణి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రేక్షకులను అలరించింది.ఈ సందర్భంగా యోగ గురువు అనంతరావు మాట్లాడుతూ.. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ ఎంతో అవసరమని అన్నారు. ప్రతిఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకొని సన్మార్గంలో నడిచేందుకు యోగ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, లోకకళ్యాణం కోసమై అమంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామివారి కల్యాణోత్సవాన్ని?అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. చివరగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా సనాతన ధర్మ పరిరక్షణ, హిందూ సంప్రదాయాలు, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో యువతలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించడంతో పాటు, చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి భావాలను పరిచయం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. భక్తి, ఐక్యత, ధర్మబద్ధమైన జీవన విధానానికి కార్తీక దీపోత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు.

లబ్ధిదారులకు పెన్షన్‌ల మంజూరు

భీమ్‌గల్, బతుకమ్మ :భీంగల్ మండలంలోని మెండోరా గ్రామములో నూతనంగా మంజూరైన (36) పెన్షన్ ల మంజూరు ఉత్తర్వులను లబ్ధిదారులకు శ్రీ గంగుల సంతోష్ కుమార్ ఫోణూ గారు ఈ రోజు పంపిణీ చేశారు ఇట్టి కార్యక్రమంలో కుంట లక్ష్మి రమేష్ సర్పంచ్, వార్డు సభ్యులు, పాల్గొన్నారు



భూ భారతి రీ సర్వేను పరిశీలించిన సర్పంచ్...

రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ మండలంలోని చిక్కడపల్లి గ్రామంలో భూ భారతి రీ సర్వేను శనివారం గ్రామ సర్పంచ్ మచ్చుర్ రమేష్, ఉప సర్పంచ్ కళ్యాణ్ లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ భారతి, జిపిఓ ప్రమీల, గ్రామ పెద్దలు మచ్చుర్ హనుమంతు, గుడిసె పెద్ద పోశెట్టి, గైని మోహన్, శ్రావణ్, సాగర్, అశోక్, రెవెన్యూ సిబ్బంది సంజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

